## క్లుప్తంగా

### మాజీ సీఎం జగన్‌ను కలసిన గణేశ్వరరావు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న గణేశ్వరరావు

**అయినవిల్లి:** మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన ముద్రగడ గణేశ్వరరావు బుధవారం కలిశారు. జగన్‌మోహన్‌రెడ్డికి గణేశ్వరరావు జ్ఞాపిక అందజేశారు. ముద్రగడ వంశీకులు వీరవల్లిపాలెంలో అందిస్తున్న సేవలను జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు.

### సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



చిరతపూడి రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈ చంద్రశేఖర్

సాక్షి ఇంపాక్ట్

**అంబాజీపేట:** చిరతపూడి వెళ్లే ప్రధాన రహదారిని జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.కోటితో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు పంచాయతీ రాజ్‌ డీఈ వి.చంద్రశేఖర్‌ తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌ 22న 'సాక్షి' దినపత్రికలో అధ్వాన రహదారిని అభివృద్ధి చేయండి అనే వార్తా కథనం వెలువడంది. దాంతో స్థానిక, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. స్థానికంగా జరుగుతున్న పనులను జేఈ సీహెచ్‌ రవి కుమార్‌తో కలసి గురువారం పరిశీలించారు. మాచవరం–అవిడి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సుమారు 1.2 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. నాణ్యతా ప్రమాణాలతో ఈ పనులు చేపడుతున్నామని చంద్రశేఖర్‌ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు పెదిరెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### సర్వే త్వరగా పూర్తి చేయాలి

**మామిడికుదురు:** వర్కింగ్‌ ఫ్రమ్‌ హోమ్‌ సర్వే త్వరగా పూర్తి చేయాలని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి సూచించారు. మామిడికుదురులో జరుగుతున్న సర్వేను గురువారం ఆర్డీఓ పరిశీలించారు. సర్వే నిర్వహణపై పలు సూచనలు అందించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంటిలో చదువుకున్న వారి వివరాలు సేకరించడంతో పాటు వారు ఏ పని చేసేందుకు ఆసక్తి చూపుతున్నారన్న వివరాలను సర్వేలో పొందుపర్చాలన్నారు. సర్వే పారదర్శకంగా చేయాలన్నారు. సర్వే నిర్వహణలో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆమె వెంట తహసీల్దార్‌ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు, డీటీ శరణ్య, ఈఓపీఆర్డీ ఎ.శ్రీనివాస్‌, పంచాయతీ ఉద్యోగులు ఉన్నారు.

### ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

**మామిడికుదురు:** గ్రామంలో గురువారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రధాన రహదారుల పక్కన పేరుకుపోయిన చెత్తను పంచాయతీ ట్రాక్టర్‌ ద్వారా డంపింగ్‌ యార్డ్‌కు తరలించారు. సర్పంచ్‌ గౌస్‌ మొహిద్దీన్‌ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. వీధులను పరిశుభ్రం చేయించారు. బ్లీచింగ్‌ చల్లించి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**కొత్తపేట:** రోడ్లపై ప్రయాణించే వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు హెచ్చరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయం వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఎస్పీ కృష్ణారావు కార్యాలయం రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్‌, సబ్‌ డివిజన్‌లో సీఐలతో నమోదైన కేసులు, వాటి పురోగతి, పెండింగ్‌ కేసులు తదితర అంశాలపై సమీక్షించారు. ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. రికార్డులు పరిశీలించామని, మూడు సంవత్సరాల కేసులను సమీక్షిస్తున్నామని, కేసుల పరంగా తగు సూచనలు ఇచ్చామన్నారు. క్రైమ్‌ రేట్‌ అదుపులో ఉందన్నారు. విచారణలు నిబంధనలకు అనుగుణంగానే జరుగుతున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 960 సీసీ కెమెరాలు పబ్లిక్‌ సహకారంతో అమర్చామన్నారు. వాటి వల్ల కొన్ని కేసులు పరిష్కరించగలిగామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, సీఐలు సీహెచ్‌ విద్యాసాగర్‌, శేఖర్‌బాబు, భీమరాజు పాల్గొన్నారు.

# బిల్లుల కోసం ఎదురుచూపులు

- మినీ గోకులాల పేరిట షెడ్ల నిర్మాణం
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం

**అంబాజీపేట:** మినీ గోకులం పథకంలో షెడ్డు నిర్మించుకున్న లబ్ధిదారులు రాయితీ సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధికి పశు సంవర్ధక శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారుల ఆధ్వర్యంలో సంయుక్తంగా మినీ గోకులాల పేరిట షెడ్ల నిర్మాణం ప్రారంభించారు. 10 శాతం రైతు వాటాతో పశువులకు షెడ్లు నిర్మించుకుంటే మిగిలిన 90 శాతం రాయితీ రూపంలో వచ్చే నగదును మీ బ్యాంకు ఖాతాలకు 15 రోజుల్లో జమ చేస్తామని అధికారులు పాడి రైతులకు చెప్పి ఆగమేఘాల మీద షెడ్లు నిర్మింపజేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం గోకులం పథకం పేరుతో పాడి రైతులకు పాడి, పశుపోషణ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో అంబాజీపేట మండలానికి 48 షెడ్లు కేటాయించారు. ఉపాధి ఏపీఓ, ఎంపీడీఓ, పశు సంవర్ధకశాఖ ఏడీ, పశు వైద్యాధికారి, వెలుగు ఏపీఎంతో కూడిన కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేయాలి. అయితే వీటిని పూర్తిగా కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకే మంజూరు చేశారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో రైతుల వద్ద కూటమి నాయకులు డబ్బులు తీసుకుని ఈ షెడ్లు మంజూరు చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.



అంబాజీపేటలో నిర్మించిన గోకులం షెడ్డు

**హడావుడిగా పూర్తి చేయించిన అధికారులు**

గోకులం కింద జత పశువులకు సంబంధించిన షెడ్డుకు రూ.1.15 లక్షలు, 4 పశువుల షెడ్డుకు రూ.1.85 లక్షలు, 6 పశువుల షెడ్డుకు రూ.2.30 లక్షల చొప్పున వస్తాయని షెడ్డు నిర్మాణం మొదలు పెట్టించారు. లబ్ధిదారులు అధికంగా ఆరు పశువుల సామర్థ్యం ఉన్న షెడ్లనే నిర్మించారు. ఇందులో రైతు 10 శాతం ఖర్చు చేయాల్సి ఉంది. మిగిలిన 90 శాతం షెడ్డు నిర్మాణ దశలో ఉండగానే మూడు దశల్లో బిల్లులు లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేయాలి.

**నాలుగు నెలలైనా మంజూరు కాని రాయితీ**

గోకులం షెడ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను అక్టోబరు, నవంబరు నెలల్లో మొదలుపెట్టి రెండు వారాల్లో పూర్తి చేశారు. అధికారుల బృందం హడావుడి చేసి లబ్ధిదారులతో షెడ్లను పూర్తి చేయించారు.

ఈ విధంగా అంబాజీపేట మండలంలో సుమారు 11 షెడ్ల నిర్మాణం పూర్తయింది. షెడ్ల నిర్మాణం పూర్తయి నాలుగు నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. లబ్ధిదారులు అధికార బృందాన్ని అడుగుతుంటే బిల్లులన్నీ అప్‌లోడ్‌ చేశామని ఒక్కసారే బిల్లంతా వస్తుందని చెబుతున్నారే కానీ డబ్బులు మాత్రం జమ కావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

**అప్పులకు వడ్డీలు కడుతూ...**

మినీ గోకులాల నిర్మాణం పూర్తి చేస్తే 15 రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో రాయితీ సొమ్ము జమ అవుతుందని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. కానీ నాలుగు నెలలవుతున్నా ప్రభుత్వం ఇంత వరకు సొమ్ము వారి ఖాతాల్లో జమ చేయక పోవడంతో లబ్ధిదారులు ఆవేదనకు గురవుతున్నారు. అప్పులు చేసి ఈ షెడ్లు నిర్మించామని, ఇప్పుడు వాటికి వడ్డీలు కడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పాడి రైతులు రాయితీ నగదు జమ కాక కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం లభించక తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాడి రైతులకు చెల్లించాల్సిన రాయితీ నగదును వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

**త్వరలో నిధుల విడుదల**

మినీ గోకులాల నిర్మాణానికి సంబంధించి త్వరలో లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయి. ఇప్పటికే లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌ చేశాం. నిధులు మంజూరు కాగానే వారి ఖాతాలో జమఅవుతాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం.

– ఎ.శ్రీవెంకటకృష్ణ, ఏపీఓ, అంబాజీపేట

## క్యాన్సర్‌ బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలి సోదరికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

**రావులపాలెం:** క్యాన్సర్‌ బారిన పడిన బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం మార్టేరు గ్రామానికి చెందిన పాల సత్యవేణి కుమారి క్యాన్సర్‌ బారిన పడి ఇప్పటి వరకు వైద్యం అంతా ఆరోగ్యశ్రీలో చేయించుకున్నారు. ఇప్పుడు ఒక మిషన్‌తో వైద్యం చేయాలి దానికి రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. వీరికి అంత ఆర్థికస్తోమత లేకపోవడంతో బంధువులు చందాలు వేసుకుని సాయం చేస్తున్నారు. దీంతో వారు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో రావులపాలెంలో కుమారి సోదరి ఇళ్ల పద్మావతికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.15 వేల చెక్కును అందజేశారు.

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా విజయమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌ సీపీ కో ఆర్డినేటర్‌ గన్నవరపు

**పి.గన్నవరం:** ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్‌ సీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ కోఆర్డినేటర్‌ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం పి.గన్నవరంలో జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి కార్యకర్తలే బలం, ఊపిరి అని అన్నారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌ రెడ్డి పార్టీ కార్యకర్తలకు ఉజ్వల భవిష్యత్‌ కల్పించనున్నారని వివరించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే సమర్థులైన నాయకులను అనుబంధ కమిటీల్లో నియమించాలని ఆయన సూచించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు, పాలన అందించారని గుర్తు చేశారు. అయితే సీఎం చంద్రబాబు మాత్రం దానికి భిన్నంగా రాక్షస పాలన సాగిస్తున్నారని, కూటమి పార్టీల వారికి మాత్రమే పనులు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారని గన్నవరపు విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు మందపాటి కిరణ్‌ కుమార్‌, అడ్డగళ్ల వెంకట సాయిరామ్‌, దొమ్మేటి వెంకట శివరామన్‌, పితాని నర్సింహరావు, యన్నాబత్తుల ఆనంద్‌ మాట్లాడుతూ గతంలో మాదిరిగానే కార్యకర్తలంతా పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలని అన్నారు. మండల ప్రధాన కార్యదర్శులు దొమ్మేటి దుర్గారావు, సాధనాల రమేష్‌, సర్పంచ్‌లు కొంబత్తుల ఏసు, వడలి కొండయ్య, జిల్లా సోషల్‌ మీడియా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

**రావులపాలెం:** స్థానిక పార్కు ప్రాంగణంలో వేంచేసిన అలివేలు మంగా, పద్మావతి ఆండాళ్‌ సహిత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం 16వ వార్షిక నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే గోవిందమాలను భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకుడు వాడపల్లి కమలనాథాచార్యులు, ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో గోవిందమాలను ధరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తుహోమం, బలిహరణ తదితర కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో గోవింద మాలధారులు స్వామివారిని తిరుచ్చి వాహనంపై మేళతాళాలతో, బాజా భజంత్రీలతో ఊరిగించారు. రాత్రికి స్వామి వారికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్ద శేష వాహనోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం శేషవాహనంపై స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్‌ పడాల పెదవెంకటరెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు.



రావులపాలెంలో తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

**ఆత్రేయపురంలో..**



ఆత్రేయపురంలో వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

**కొత్తపేట:** మండల కేంద్రం ఆత్రేయపురంలో వేంచేసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆలయ శాశ్వత ధర్మకర్త, ఆలయ చైర్మన్‌ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు–రాజ్యలక్ష్మి దంపతులు, వెంకట సత్యరాజ్యలక్ష్మి చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల ప్రముఖ వేదపండితులు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పూజల అనంతరం కల్యాణం సందర్భంగా ఆలయ చైర్మన్‌ దంపతులు స్వామికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను హనుమత్‌ వాహనంపై ఊరేగించారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు గోరింట వినయ్‌కుమార్‌రాజు తదితరులు పర్యవేక్షించారు.

**పడమటిపాలెంలో..**

**మలికిపురం:** శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం పడమటిపాలెంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వాడపల్లి బుచ్చిబాబు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద మురళీ కోలాటం ప్రదర్శించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి దర్శించుకున్నారు.

## మౌలిక వసతుల కల్పనపై సీపీఓ పరిశీలన



మామిడికుదురు గెయిల్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఓ

**మామిడికుదురు/రాజోలు:** మామిడికుదురు భోయి భీమన్న మానవ వనరుల శిక్షణ కేంద్రాన్ని చీఫ్‌ ప్లానింగ్‌ ఆఫీసర్‌ పి.వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ కేంద్రానికి కావాల్సిన మౌలిక వసతులపై ఆయన ఆరా తీశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులు, శిక్షణ వసతులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ శిక్షణ కేంద్రంలో ఈ ఏడాది అయిదో బ్యాచుకు శిక్షణ ఇస్తున్నామని గెయిల్‌ సీనియర్‌ మేనేజర్‌ (హెచ్‌ఆర్‌) ప్రభాకర్‌ తెలిపారు. 140 మంది ఇక్కడ శిక్షణ పొందుతున్నారని చెప్పారు. రెండు బ్యాచులకు మార్చి నెలాఖరు నాటికి, మిగిలిన మూడు బ్యాచులకు ఏప్రిల్‌ నాటికి శిక్షణ పూర్తవుతుందని అన్నారు. ఎలక్ట్రికల్‌, వెల్డింగ్‌, కాల్‌ సెంటర్‌, ఆటో క్యాడ్‌పై నిరుద్యోగులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే రాజోలు, కడలిలోనూ ఆయన పర్యటించారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఎం ఎం.దుర్గారావుదొర, హరిశేషు, రాంబాబు తదితరులు ఉన్నారు.

## పలువురికి పరామర్శ

**పి.గన్నవరం:** మండలంలోని పలువురిని నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ కోఆర్డినేటర్‌ గన్నవరపు శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. ఆర్‌.ఏనుగుపల్లిలో పార్టీ నాయకుడు ఈతకోట రమేష్‌ సోదరి కంటి సమస్యతో బాధపడుతున్న నాగమణిని గన్నవరపు పరామర్శించారు. నాగుల్లంక గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సికిలే వెంకటేష్‌ను ఆయన పరామర్శించారు. అలాగే వాడ్రేవుపల్లిలో పితృ వియోగంతో బాధపడుతున్న పార్టీ నాయకుడు కర్రి శ్రీనును పరామర్శించారు. కార్యక్రమాల్లో నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, దొమ్మేటి వెంకట శివరామన్‌, పేరిచర్ల కుమార్‌రాజు, చప్పిడి శ్రీరామశెట్టి, యాండ్ర ఏసు, దొమ్మేటి దుర్గారావు, కొండేటి నాని, మంగం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ రుణాలు తిరిగి చెల్లించాలి

**అంబాజీపేట:** సొసైటీల ద్వారా రైతులు తీసుకున్న రుణాల్ని సకాలంలో తిరిగి చెల్లించకపోతే రైతులకే నష్టమని ఆంధ్రప్రదేశ్‌ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ సభ్యుడు, భారతీయ కిసాన్‌ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీరామ నాగేంద్ర ప్రసాద్‌ (జమీల్‌) అన్నారు. అంబాజీపేట సొసైటీ కార్యాలయంలో మహాజనసభ సొసైటీ పర్సన్‌ ఇంచార్జ్‌ ఐ.శ్రీనివాస్‌ అధ్యక్షతన గురువారం జరిగింది. జమీల్‌ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా 10 వేల ఫార్మర్స్‌, ప్రొడ్యూసర్స్‌ ఆర్గనైజేషన్లు నెలకొల్పాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆర్గనైజేషన్‌ల ద్వారా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి రుణాలు తీసుకుని వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుతో పాటు కొనుగోలు, కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి ఆదాయాన్ని ఆర్జించవచ్చన్నారు. అంతకు ముందు సొసైటీ సీఈవో కుంపట్ల అయ్యప్ప నాయుడు రైతులకు బడ్జెట్ను చదివి వినిపించారు. 2025–26 సంవత్సరానికి రూ.9.85 లక్షల నికర లాభంతో బడ్జెట్ను ప్రవేశపెట్టారు. ఈ ఏడాది టర్నోవర్‌ రూ.20.06 కోట్లు కాగా, ఆదాయం రూ.37.32 లక్షలు వచ్చిందన్నారు. సుమారు రూ.70 లక్షల ఎరువులు అమ్మకాలు జరిపామని, లాకర్స్‌, బంగారు నగలపై అప్పు, కామన్‌ సర్వీస్‌ సెంటర్ల ద్వారా ఆదాయం వస్తుందన్నారు. సొసైటీలో 1208 మంది సభ్యులు ఉన్నారని, వీరిలో ఎక్కువ శాతం మంది తీసుకున్న రుణాల ద్వారా రూ.2 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాచవరం గ్రామ సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, నీటి సంఘం డైరెక్టర్‌ మట్టపర్తి వినాయకరావు, అరిగెల సూరిబాబు తదితరులు ఉన్నారు.

## ఆరోగ్యం, జీవన ప్రమాణాలకు పారిశుధ్యం కీలకం

కలెక్టర్‌ మహేష్‌కుమార్‌

**మామిడికుదురు:** ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలకు పారిశుధ్యం ఎంతో కీలకమైన అంశంగా గుర్తించాలని కోనసీమ జిల్లా కలెక్టర్‌ ఆర్‌.మహేష్‌ కుమార్‌ పంచాయతీ సిబ్బందికి సూచించారు. పాశర్లపూడిలో గురువారం 216వ నంబర్‌ జాతీయ రహదారి బైపాస్‌ రోడ్డు నిర్మాణం కోసం సేకరించిన భూములను కలెక్టర్‌ ఆర్డీఓ మాధవితో కలసి పరిశీలించారు. భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులు, ఫిర్యాదుదారులతో భూసేకరణ సమస్యలపై చర్చించారు. అనంతరం పాశర్లపూడి గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం డంపింగ్‌ యార్డ్‌ ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు గ్రామ పారిశుధ్యం మెరుగుదల, అభివృద్ధికి సూచికలన్నారు. శాస్త్రీయ దృక్పథంతో ఘన వ్యర్థాల నిర్వహణలో చెత్త నుంచి సంపద తయారీలో జిల్లాను ఆదర్శప్రాయంగా నిలిపేందుకు పంచాయతీశాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరుపై క్షేత్ర స్థాయిలో పారిశుధ్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌ సాధన దిశగా ప్రభుత్వం వ్యక్తిగత, గ్రామ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి కేంద్రీకరిస్తూ అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో అపరిశుభ్రత ఒకటన్నారు. దీని వల్ల అనారోగ్యాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు తడి, పొడి చెత్తతో పాటు ప్లాస్టిక్‌ వ్యర్థాలను ఈ కేంద్రాలకు తరలిస్తూ వానపాములతో వర్మీ కంపోస్టును తయారు చేయాలన్నారు. ప్లాస్టిక్‌ను నేరుగా లేదా కరిగించి విక్రయాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ శాంతాలక్ష్మి, తహసీల్దార్‌ సుబ్రహ్మణ్యంఆచారి, పంచాయతీ, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



పాశర్లపూడిలో బైపాస్‌ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌ మహేష్‌కుమార్‌

## 628 గ్రామాల్లో పైలట్‌ ప్రాజెక్టుగా భూముల రీసర్వే

**అయినవిల్లి:** రాష్ట్రంలో 628 గ్రామాల్లో పైలట్‌ ప్రాజెక్టుగా పంట భూముల రీసర్వే చేస్తున్నట్లు రీ సర్వే ప్రాజెక్టు స్పెషల్‌ ఆఫీసర్‌, సర్వే ట్రైనింగ్‌ ఏడీ ఎంవీ రంగప్రసాద్‌ అన్నారు. రాష్ట్రంలో 17 వేల గ్రామాలు ఉండగా 6600 గ్రామాల్లో రీసర్వేను ప్రారంభించామన్నారు. పైలట్‌ ప్రాజెక్టుగా 628 గ్రామాలను తీసుకున్నామన్నారు. ఈ నెల 31 తేదీకల్లా పైలట్‌ ప్రాజెక్టు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలని స్థానిక అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. అలాగే సిరిపల్లి గ్రామం పైలట్‌ ప్రాజెక్టు భాగంగా రీసర్వే చేపట్టామని రంగప్రసాద్‌ తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలో 1149.69 ఎకరాల్లో రీ సర్వే చేయాల్సి ఉందన్నారు. ఇందులో 796.69 ఎకరాల్లో ఇప్పటికే రీసర్వే పూర్తి చేశామన్నారు. మిగిలిన 353 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉందన్నారు. రైతులు నేరుగా తమ పంట భూముల రికార్డులతో క్షేత్రస్థాయిలో ఉంటే ఈ సర్వే వేగవంతం అవుతుందన్నారు. కొంత మంది ఉపాధికి కోసం బయట గ్రామాలకు వెళ్లడంతో రీసర్వే చేయడం కొంత క్షేత్ర స్థాయిలో ఇబ్బందిగా ఉందన్నారు. రైతులు పూర్తిగా సహకరించాలన్నారు. రీసర్వే వల్ల తమ పంటభూమిలో ఏ పంట సాగు చేశారు. బ్యాంకు రుణాలతో పాటు అనేక అంశాల్లో రైతులు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్‌ సీహెచ్‌ నాగలక్ష్మమ్మ, రీ సర్వే డీటీ స్వర్ణ, డీఐ ప్రభాకర రావు, మండల సర్వేయర్‌ ఉమాదేవి, వీఆర్‌ఓ ఎన్‌.నాగరాజు, పి.నాగేశ్వరరావు, వీవీవీ సత్యనారాయణ, విలేజ్‌ సర్వేయర్లు తదితరులు ఉన్నారు.



సిరిపల్లిలో రిపోర్టులు పరిశీలిస్తున్న రీసర్వే ట్రైనింగ్‌ ఏడీ రంగప్రసాద్‌

## పాఠశాలకు మైక్‌ సిస్టమ్‌ వితరణ

**ఆలమూరు:** మండలంలోని చింతలూరు ఎంపీయూపీ పాఠశాలకు గురువారం మైక్‌ సిస్టమ్‌ బహుకరణ జరిగింది. సామర్లకోటకు చెందిన సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ గిడుతూరి మల్లేశ్వరరావు తన కుమారుడు శ్రీరామ్‌ భరద్వాజ్‌ పుట్టినరోజు సందర్భంగా సుమారు రూ.పదివేలు విలువైన మైక్‌ సిస్టమ్‌తో పాటు స్పీకర్లను ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ చేతుల మీదుగా హెచ్‌ఎం ఉడతా వెంకటేశ్వరరావుకు అందజేశారు. సోషల్‌ మీడియాలో పాఠశాలకు సంబంధించిన విద్యార్థులకు సంబంధించి బోధనలను మరింత సరళీకృతం చేసేందుకు వీలుగా ఈ సిస్టమ్‌ను బహూకరిస్తున్నట్లు దాతలు తెలిపారు. ఇటీవల కాలంలో పాఠశాల అభ్యున్నతికి కృషి చేస్తున్న దాతలకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలియజేశారు. సీఆర్‌పీ యడ్ల అపర్ణ, ఉపాధ్యాయుడు వి.దుర్గాప్రసాద్‌ పాల్గొన్నారు.



చింతలూరులో పాఠశాలకు మైక్‌ సిస్టమ్‌ను బహూకరిస్తున్న దాతలు

## హీరో కల్యాణ్‌రామ్‌ సందడి

**పి.గన్నవరం:** మండలంలోని చాకలిపాలెం కల్యాణ మండపంలో గురువారం నందమూరి వారి ఆస్థాన సిద్ధాంతి కారుపర్తి కోటేశ్వరరావు కుమార్తె నాగ ఉషా గాయత్రి, ఫణి సూర్య శ్రీనివాస శ్రీసాయి అఖిల్‌ వివాహం ఘనంగా జరిగింది. శాసనసభ స్పీకర్‌ చింతకాయల అయ్యన్నపాత్రుడు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే సినీ హీరో నందమూరి కళ్యాణ్‌రామ్‌, జూనియర్‌ ఎన్టీఆర్‌ తల్లి షాలిని, ఆయన సతీమణి లక్ష్మీప్రణతి తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. కళ్యాణ మండపం ఆవరణలో కళ్యాణ్‌రామ్‌, ప్రణతి సందడి చేశారు. అభిమానులు కళ్యాణరామ్‌ తదితరులతో సెల్ఫీలు దిగారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న కల్యాణ్‌రామ్‌, షాలిని, లక్ష్మీప్రణతి



చాకలిపాలెంలో సందడి చేస్తున్న సినీ హీరో కల్యాణ్‌రామ్‌

## మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

**అంబాజీపేట:** ప్రస్తుత కాలంలో మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి, ఆత్మరక్షణ చేసుకోవాలని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెల్ఫ్‌ డిఫెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎస్సై చిరంజీవి సమక్షంలో తైక్వాండో సీనియర్‌ కోచ్‌ పితాని త్రిమూర్తులు పర్యవేక్షణలో బాలికలకు సెల్ఫ్‌ డిఫెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఎస్సై మాట్లాడుతూ మహిళా భద్రత, సాధికారతకు ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, బీఎస్‌ఎన్‌ మూర్తి, తైక్వాండో కోచ్‌ పితాని లక్ష్మీ భార్గవి, మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సెల్ఫ్‌ డిఫెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై